క్లుప్తంగా

మహిళా ఉద్యోగిని దూషించిన టీడీపీ కార్యకర్తలు

- రాజీ ప్రయత్నాలు చేసి భంగపడిన దామచర్ల
- ఇద్దరు కార్యకర్తల అరెస్టు

ఒంగోలు టౌన్: తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు కార్యకర్తలు ఓ మహిళా ఉద్యోగినిని దూషించిన ఘటన మండలంలోని కరవదిలో జరిగింది. ఈ ఘటనలో పోలీసుస్టేషన్‌కు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రాజీ చేసుకోవాల్సిందిగా సదరు ఉద్యోగినిపై ఒత్తిడి తీసుకువచ్చారు. వివరాల్లోకి వెళితే.. కరవది గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఏలూరి సూరిబాబు, దేవరంపాటి రాము... మద్యం మత్తులో రోడ్డుపై వెళుతున్న ఓ మహిళా ఉద్యోగిని పట్ల అసభ్యంగా ప్రవర్తించి దూషించారు. దీంతో సదరు ఉద్యోగిని సోమవారం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సీఐ శ్రీనివాసరెడ్డి వారిని అదుపులోనికి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో పోలీసుస్టేషన్కు చేరుకొని సదరు మహిళను రాజీ పడాల్సిందిగా తీవ్రంగా ఒత్తిడి చేశారు. ఆమె అంగీకరించకపోవడంతో ఆయన వెనుదిరిగిపోయారు. కాగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేడు చీమకుర్తిలో గడప గడపకు మన ప్రభుత్వం

చీమకుర్తి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం చీమకుర్తిలోని 3వ సచివాలయం పరిధిలోని 7, 8, 9 వార్డుల్లో నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. పట్టణ, రూరల్ పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు, రూరల్ పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

మానవ హక్కుల రక్షణ మండలి ఉపాధ్యక్షునిగా శంకర్


ఇస్తర్ల శంకర్

చీమకుర్తి: రియాన్ అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ మండలి ఏపీ వైస్ ప్రెసిడెంట్‌గా చీమకుర్తికి చెందిన ఇస్తర్ల శంకర్‌ను నియమించారు. ఆ సంఘం అంతర్జాతీయ డైరెక్టర్ కే.జాన్ వెస్లీ తనను నియమించినట్లు శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బోర్డును ఢీకొనడంతో తీవ్ర గాయాలు

ఉలవపాడు: జాతీయ రహదారిపై వేగ నియంత్రణకు ఏర్పాటుచేసిన బోర్డును ఢీ కొనడంతో ద్విచక్రవాహనదారునికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన కరేడు ర్యాంపు వద్ద మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు..ఒంగోలు శ్రీనగర్‌కాలనీకి చెందిన మార్తాల చిరంజీవి ఒంగోలు నుంచి గుడ్లూరులో ఉన్న బంధువుల ఇంటికి వెళుతున్న సమయంలో కరేడు ర్యాంపు వద్ద వేగం తగ్గించడానికి పోలీసులు ఏర్పాటు చేసిన బోర్డును ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయమైంది. రోడ్‌సేఫ్టీ సిబ్బంది హైవే అంబులెన్స్ వాహనంలో ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. ఎస్సై త్యాగరాజు సంఘటనా స్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

కందుకూరు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని రెండో వేలం కేంద్రం నిర్వహణాధికారి కె.రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పామూరు రోడ్డులోని వేలం కేంద్రం వద్ద ఆయన స్వచ్ఛభారత్‌లో భాగంగా పిచ్చిమొక్కల తొలగింపు, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. వేలం కేంద్రం పరిసరాలు రైతులకు మంచి వాతావరణంతో ఆహ్లాదాన్ని ఇచ్చే విధంగా చూస్తున్నామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారని, మొక్కలు నాటడడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని సూచించారు. ఆధునిక జీవితంలో మానవమనుగడకు చెట్లు ఎంతో అవసరమనే విషయాన్ని గుర్తించాలన్నారు.

క్రికెట్ పోటీల విజేత ఫ్రెండ్స్ లెవెన్ జట్టు

సీఎస్‌పురం: కేవైఎఫ్ క్రికెట్ పోటీల్లో ఫ్రెండ్స్ లెవెన్ జట్టు విజేతగా నిలిచింది. సంక్రాంతిని పురస్కరించుకొని కోవిలంపాడు యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో సీఎస్‌పురం, పామూరు మండలాల స్థాయిలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో 38 జట్లు పాల్గొనగా కోవిలంపాడు యూత్ ఫోర్స్-ఫ్రెండ్స్ లెవెన్ జట్లు మంగళవారం జరిగిన ఫైనల్ పోటీల్లో తలపడగా ఫ్రెండ్స్ లెవెన్ జట్టు విజయం సాధించింది. విజేతలకు ప్రథమ బహుమతి రూ.30,116, ద్వితీయ బహుమతి రూ.20,116, మెమొంటోలు అందజేశారు. నాగంపల్లి జట్టుకు చెందిన కళ్యాణ్‌ను మ్యాన్ ఆఫ్ ద సిరీస్, బెస్ట్ బౌలర్‌గా, ఫ్రెండ్స్ లెవెన్ జట్టుకు చెందిన రవిని బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కోవిలంపాడు సర్పంచ్ షేక్ ఖాదర్‌బీ బుజ్జి, నారాయణస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, పామూరు మండలం దూబగుంట సర్పంచ్ కందుల శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.


బండలాగుతున్న ఎడ్ల జత


విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి

హోరా హోరీగా బండలాగుడు పోటీలు

- తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేల విజేత బేస్తవారిపేట ఎడ్లు

కొత్తపట్నం: తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు ప్రదర్శనలో తెలంగాణ జిల్లా హుజూర్ నగర్‌కు చెందిన ఏఎస్పీ సుంకి సురేంద్రరెడ్డి ఒక ఎద్దు, ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం ఖాజీపురం గ్రామానికి చెందిన వెగనాటి ఓసూరారెడ్డి ఒక ఎద్దు కలిసి పోటీలో పాల్గొని విజేతలుగా నిలిచాయి. మండలంలోని పాదర్తి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం రాత్రి తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల స్థాయి న్యూకేటగిరీ ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 11 జతల ఎడ్లు పాల్గొని పోటీ పడగా తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర ఎడ్ల జత 5,781 అడుగులు లాగి ప్రథమ బహుమతి లక్ష రూపాయలు కైవసం చేసుకుంది. వీరికి గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మూగా బాలాజీ నగదు బహూకరించారు. చీమకుర్తి మండలానికి చెందిన జంగా విజయభాస్కర్‌రెడ్డి ఎడ్ల జత 5,379 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలవగా.. రూ.50 వేల నగదును చెరుకూరి వీరరాఘవరావు, ఉషారాణి బహూకరించారు. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్ల జత 5,379 అడుగులు లాగి తృతీయ బహుమతి కైవసం చేసుకోగా రూ.40 వేల నగదును యలగాల ఆదినారాయణ అందజేశారు. దర్శి మండలానికి చెందిన గానుగపంట రాజశేఖరరెడ్డి ఎడ్ల జత 4,800 అడుగులు లాగడంతో నాలుగో బహుమతి రూ.30 వేల నగదును పాలేటి ఆంజనేయులు, శ్రీదేవి పంపిణీ చేశారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామానికి చెందిన గాదె శ్రీనివాసరెడ్డి ఎడ్ల జత 4,407 అడుగులు లాగి ఐదో బహుమతి కైవసం చేసుకోగా రూ.20 వేలు ఎంపీటీసీ సభ్యురాలు గుడి అరుణ, నాగిరెడ్డి బహూకరించారు. బేస్తవారిపేట మండలానికి చెందిన గంగూలి బ్రదర్స్ ఎడ్ల జత 3,898 అడుగులు లాగి ఆరో స్థానంలో నిలవగా రూ.15 వేలు మాజీ సర్పంచ్ జజ్జర హరినారాయణ అందించారు. ఎన్‌టీఆర్ జిల్లా జూపూడి మండలానికి చెందిన పీతా వెంకటేశ్వరరావు ఎడ్ల జత 3,830 అడుగులు లాగి ఏడో బహుమతి గెలుచుకోగా రూ.12 వేలు పాకల చిరంజీవి సతీమణి వెంకటేశ్వరమ్మ నగదు బహూకరించారు. కొత్తపట్నం మండలానికి చెందిన పల్లెకొండ సాయిప్రసాద్ ఎడ్ల జత 2 వేల అడుగులు లాగి ఎనిమిదో బహుమతి సాధించగా రూ.10 వేలు పాదర్తి సర్పంచ్ కట్టా సౌందర్య, చంద్రశేఖర్ నగదు అందించారు. తొమ్మిదో బహుమతి ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామానికి చెందిన కోమట్ల సాయితేజ ఎడ్ల జత 1,300 అడుగులు లాగి కైవసం చేసుకోగా రూ.8 వేల నగదును పంత్రంగం బ్రహ్మయ్య అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా కృష్ణాజిల్లాకు చెందిన ఎస్.రాధాకృష్ణ, నంద్యాలకు చెందిన జి.నరసింహారావు వ్యవహరించారు. వారిద్దరినీ శాలువాతో సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు, ద్వారం మురళి, సూరిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ బాగుండాలి

- నిర్వాహకులు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- ప్రజాభిప్రాయాలకు అనుగుణంగా వసతుల కల్పన
- నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేసిన కమిషనర్ వెంకటేశ్వరరావు


మున్సిపల్ అధికారులు, ఆర్పీ, సీఓలతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని ప్రజా మరుగుదొడ్ల(పబ్లిక్ టాయిలెట్స్)నిర్వహణ బాగుండాలని ఆయా సంస్థల నిర్వాహకులు, ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బందికి ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు దిశానిర్దేశం చేశారు. స్థానిక కమిషనర్ ఛాంబర్‌లో అధికారులు, సిబ్బంది, రిసోర్స్‌పర్సన్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. మరుగుదొడ్లు 2.ఓ పై వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లు నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సర్వే ప్రకారం ప్రజా మరుగుదొడ్లు ఏవిధంగా ఉన్నాయి అన్నది ప్రజల నుంచే రాబట్టాలన్నారు. మరుగుదొడ్ల పరిస్థితులు, భద్రత, వాసన రాకుండా తీసుకుంటున్న చర్యలు, మహిళలకు ప్రత్యేకంగా చేస్తున్న ఏర్పాట్లు, లైటింగ్ పరిస్థితి, గాలి, వెలుతురు ఏ విధంగా ఉంది, వికలాంగులకు చేస్తున్న ప్రత్యేక ఏర్పాట్లపై, రుసుంలు వసూలు చేస్తున్న విధానాలపై సర్వే నిర్వహించాలని సూచించారు. స్వచ్ఛత యాప్ ద్వారా ఈ సర్వే చేపట్టాలని కూడా సూచించారు. సమీక్షలో మున్సిపల్ ఇంజినీర్ కె.మాల్యాద్రి, మెప్మా డీసీహెచ్.కొండయ్య, పారిశుధ్య సూపర్‌వైజర్ పిచ్చయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఒంగోలు: నగరంలోని 33వ డివిజన్ శివప్రసాద్ కాలనీ సచివాలయ పరిధిలోని వడ్డెవానికుంట వద్ద ఉన్న సరస్వతీ కాలేజీ వద్ద నుంచి బుధవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అభిమానులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కోడి పందేల శిబిరంపై దాడులు

కొత్తపట్నం: కోడి పందేల శిబిరాలపై పోలీసులు దాడులు చేశారు. మండలంలోని గమళ్లపాలెం శివారు ప్రాంతాల్లో మంగళవారం దాడులు నిర్వహించి ముగ్గురు జూదరులను అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.మధుసూదన్‌రావు తెలిపారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

శివం ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం

- ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు


పేదలకు అన్నదానం చేస్తున్న డీఎస్పీ, ఇతర సభ్యులు

ఒంగోలు టౌన్: శివం ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకమని ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాసరావు అన్నారు. శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించి 200 రోజులైన సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచార వాహనం ద్వారా నగరంలోని అనాథల కడుపు నింపేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఫౌండేషన్‌కు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సాటి మనిషికి సాయం చేయడంలో ఉన్న సంతృప్తి మరొకటి లేదని ఐటీసీ కాంట్రాక్టర్ మండవ మురళీకృష్ణ అన్నారు. అనంతరం యాచకులు, అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, కవి మొగిలి దేవ, కొమ్మి రమణయ్య, శేషయ్య పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ

ఒంగోలు రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని పాతపాడులో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా పోటీలు నిర్వహించారు. పోటీలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథులుగా ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాయపాటి అంకయ్య, వైస్ ఎంపీపీ అయ్యల వాణికొండలు, సర్పంచ్ ఎం. రామిరెడ్డి, మాజీ సర్పంచ్ అయ్యప్పరెడ్డి, యూనియన్ నాయకులు ఎం. అశోక్‌రెడ్డి, ఎం. కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎం.వెంకటాద్రి, ఎం. హర్షవర్ధన్‌రెడ్డి, ఎ. భానుప్రసాద్‌రెడ్డి, కె. రాఘవరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీని ఘనంగా సన్మానించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఏకేవీకే కాలేజీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఒంగోలు: స్థానిక ఆంధ్రకేసరి విద్యాకేంద్రంలో మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సమ్మేళనానికి పూర్వ ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కళాశాల అధ్యక్షుడు మండవ నాగేశ్వరరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఒకరికొకరు పరిచయాలు పెంచుకుని నిజ జీవితంలో వారికి వారు తోడ్పాటు అందించుకోవాలన్నారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పి.చెంచురామయ్య మాట్లాడుతూ ఆంధ్రకేసరి విద్యాకేంద్రం విద్యాభారతి అనుబంధ సంస్థగా పనిచేస్తూ సమాజ సేవలో ముందుంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.పున్నయ్య, కాలేజీ కార్యాలయ సిబ్బంది జె.కోటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం పూర్వ అధ్యాపకులను, కాలేజీ యాజమాన్యాన్ని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సతీష్, రవిచంద్ర, కళ్యాణి, కృష్ణవేణి, బ్రహ్మానాయుడు, ప్రతిమ, షన్ను తదితరులు పాల్గొన్నారు.

మోడీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి


బీజేపీ జిల్లా అధ్యక్షుడికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

ఒంగోలు: మోడీ ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని, లేకుంటే రాజకీయ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, జిల్లా ఇన్‌చార్జి జలదంకి నరశింహారావు మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా నాయకులు తోరటి ఆనంద్ మాదిగ పాల్గొన్నారు.

దివ్యాంగుల ట్రస్టులో అన్నదానం


దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న మహబూబ్

ఒంగోలు టౌన్: నగరంలోని సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టులోని దివ్యాంగులకు ఎస్ఎంఎస్ ఫుడ్స్ అధినేత, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ మంగళవారం అన్నదానం ఏర్పాటు చేశారు. దివ్యాంగులకు సేవ చేసే అవకాశం లభించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మారెళ్ల సుబ్బారావు, షేక్ అల్లాబక్షు, జడ శ్రీనివాసరావు, మొగిలి దేవ, మున్నా, ట్రస్టు కార్యదర్శి షేక్ సర్దార్ బాషా తదితరులు పాల్గొన్నారు.


నేడు మండల సర్వసభ్య సమావేశం

మద్దిపాడు: మండల సర్వసభ్య సమావేశం బుధవారం 18వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీల అధ్యక్షులంతా పాల్గొనాలని ఒక ప్రకటనలో తెలిపారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ శాంతారావు

కొత్తపట్నం: బీఆర్ అంబేడ్కర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ చిరుతోటి జీవన్ సహకారంతో వృద్ధులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎంపీటీసీ మిట్నసల శాంతారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మిట్నసల శత్రుఘ్న, లింగంగుంట పేరయ్య, కొండ్రు నరేష్, రాతికింద కోటయ్య, కె.రోశయ్య తదితరులు పాల్గొన్నారు.


మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయంపై సూర్యుడు అస్తమిస్తున్న దృశ్యం

ఆదిత్య విన్యాసం

మద్దిపాడు: సృష్టిలో పలు అందాలు కనువిందు చేస్తుంటాయి. అటువంటి ఒక అద్భుతం వారం రోజులుగా మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద జరుగుతోంది. సూర్యుడు అస్తమించే సమయంలో మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయ గోపురంపై నుంచి కిందకు దిగుతూ ఆలయంలోకి ఏదో ఒక శక్తి ప్రవేశిస్తున్నట్లు కనిపిస్తుంది. ఈ విధంగా సూర్యుడు అస్తమిస్తూ చేసే విన్యాసాలను పర్యాటకులు ఆసక్తిగా తిలకిస్తూ పరవశించారు.